గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలి

బీబీపేట్, ఫిబ్రవరి 4: గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులను చేయించాలని మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ అన్నారు. మండలంలోని జనగామ గ్రామాన్ని వారు మంగళవారం సందర్శించారు. గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో అబ్బాగౌడ్, ఏపీవో రజిని, టెక్నికల్ అసిస్టెంట్ వినయ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతల సమూహం కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి, ఫిబ్రవరి 4: కామారెడ్డి రక్తదాతల సమూహం – 2025 సంవత్సరానికి నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జమీల్ హైమద్, డాక్టర్ పుట్ట అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించి అందజేస్తున్న సంస్థకు పనిచేసే అవకాశం లభించడం సంతోషంగా ఉన్నదన్నారు. భవిష్యత్తులో మరిన్ని రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి తలసేమియా చిన్నారులు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి కోసం రక్తాన్ని సేకరిస్తామని చెప్పారు. సమూహం నిర్వాహకుడిగా బాలు, గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ వేదప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా గంప ప్రసాద్, వెంకటరమణ, సలహాదారుడిగా ఎర్రం చంద్రశేఖర్ కొనసాగనున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

సంగమేశ్వర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

బీబీపేట్ (దోమకొండ), ఫిబ్రవరి 4: వచ్చే వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. దోమకొండ మండలంలోని సీతారాంపల్లి, సంగమేశ్వర్, అంబారిపేట గ్రామాలను వారు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. నీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ ఏఈలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైలెన్సర్లు ధ్వంసం

సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

కామారెడ్డి, ఫిబ్రవరి 4: శబ్ద కాలుష్యానికి కారణమైన సైలెన్సర్లను పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. పట్టణంలో శబ్ద కాలుష్యం కలిగిస్తున్న వాహనాల సైలెన్సర్లను పోలీసులు రెండు నెలలుగా సీజ్ చేశారని ఏఎస్పీ చైతన్యారెడ్డి తెలిపారు. యజమానులపై వాహన చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మొత్తం 65 సైలెన్సర్లను ఇందిరా చౌక్ వద్ద రోలర్ సహాయంతో ధ్వంసం చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా మోడిఫై చేసిన సైలెన్సర్లను వాడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై శ్రీరామ్, ట్రాఫిక్ ఎస్సై మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 4: జిల్లాలో 19 ఏండ్లలోపు వారందరికీ నులి పురుగుల నివారణ మాత్రలను అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్కూళ్లు, కాలేజీల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, బడిబయటి పిల్లలకు 15వ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలన్నారు. జూన్ 2024లో జిల్లాలో 19ఏండ్లలోపు ఉన్న 2,58,599 మందికి అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు చెప్పారు. ప్రతి పాఠశాల, కాలేజీలో ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విద్య, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ డీపీఎం రమేశ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలకూ ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్..

రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రతి పాఠశాలకు ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ను నియమించినట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు పోక్సో చట్టంపై మంగళవారం ఒక రోజు ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు ఎలాంటి లైంగిక దాడులకూ గురికాకుండా, ప్రారంభ దశలోనే అణిచివేసేందుకు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాళ్లకు సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ చిల్డ్రన్స్ ఇన్ స్కూల్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ.. పాఠశాలల్లో బోధన ఒకటే ముఖ్యం కాదని, చిన్నారుల బాగోగులు చూడాల్సిన బాధ్యత కూడా ఉన్నదన్నారు. లైంగిక వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సీడబ్ల్యూసీ మెంబర్ స్వర్ణలత, యూనిసెఫ్ రిసోర్స్ పర్సన్ డేవిడ్‌రాజ్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ లక్షణాలు ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చు

కామారెడ్డి ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదా

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఫరీదా

కామారెడ్డి, ఫిబ్రవరి 4: క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని జయించే అవకాశాలు ఉంటాయని కామారెడ్డి ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదా అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా దవాఖానలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసుకోవడంతోపాటు నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారిణి డాక్టర్ శిరీష, పాలిటివ్ కేర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గణశ్యామ్, నర్సింగ్ ఆఫీసర్లు, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుల తడకగా కులగణన సర్వే రిపోర్టు

మాట్లాడుతున్న నాగరాజు

కామారెడ్డి, ఫిబ్రవరి 4: కుల గణన సర్వే రిపోర్టు తప్పుల తడకగా ఉన్నదని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులాల జనాభాను తక్కువ చేసి, అగ్ర కులాల జనాభాను ఎక్కువ చేసి చూపించడం బీసీలను అవమానించడమే అన్నారు. 2014 లో బీసీలు 51శాతం ఉంటే.. 2024లో 46శాతానికి ఎలా తగ్గతారని ప్రశ్నించారు. పదేండ్లలో 21లక్షల మంది బీసీలను తక్కువ చేసి చూపించారన్నారు. బీసీ సబ్ కమిటీ చైర్మన్‌గా మంత్రి పొన్నం ప్రభాకర్ ఉండాలి కానీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎలా ఉంటారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, కార్యదర్శి శ్రవణ్, మోహన్ చారి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల పరిరక్షణకు చర్యలు

కందకాలను తవ్విస్తున్న ఫారెస్టు, పోలీసు అధికారులు

రాజంపేట్, ఫిబ్రవరి 4: అటవీ భూముల పరిరక్షణకు ఫారెస్టు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శేర్‌శంకర్‌తండాలోని 677 కంపార్ట్‌మెంట్ ఎల్లారెడ్డిపల్లి బీట్ పరిధిలో ఉన్న అటవీ భూముల చుట్టూ మంగళవారం కందకాలు తవ్వించారు. ఇటీవల ఫారెస్టు సిబ్బందిపై జరిగిన దాడిని దృష్టిలో ఉంచుకొని పోలీసు, అటవీ శాఖల ఆధ్వర్యంలో తవ్వకాలు తీయించారు. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో కందకాలు తవ్వించామని, పట్టాలేని భూముల్లో పంటలు సాగు చేస్తున్నందున, పంటలు కోతలు పూర్తైన అనంతరం కందకాలు తీయిస్తామని ఎఫ్‌డీవో పీవీ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వోలు వి.రమేశ్, సంతోష, ఓంకార్, వాసుదేవ్, ఆర్గాండ సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ బాబా, ఎల్లారెడ్డిపల్లి ఎఫ్‌బీవో శ్రీనివాస్, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, రాజంపేట ఎస్సై పుష్పరాజ్, అటవీ, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

మనస్థాపం చెంది వ్యక్తి ఆత్మహత్య

భిక్కనూరు, ఫిబ్రవరి 4: మనస్థాపం చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లింగుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. దోమకొండ ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన ఉప్పు భూపతి(50) రెండేండ్లుగా అత్తగారి ఊరైన భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. తాగుడుకు బానిసైన అతడు పని చేయకుండా ఇంట్లో ఖాళీగా ఉండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్థాపానికి గురైన భూపతి సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కల్యాణలక్ష్మి డబ్బులు కాజేసిన వీఆర్ఏ గణేశ్‌పై చీటింగ్ కేసు నమోదు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 3: బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన వీఆర్ఏ గణేశ్‌పై మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వీరాపూర్ గ్రామానికి చెందిన పవర్ సాంబయ్య కూతురు మమత పెళ్లి కాకుండానే వీఆర్ఏ గణేశ్ ఆమె పేరుతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి గణేశ్ భార్య అతిమెల మమత పేరుపై కల్యాణలక్ష్మి డబ్బులను బ్యాంకులో నుంచి డ్రా చేసుకున్నాడని సాంబయ్య ఫిర్యాదు చేశాడు. దీంతో గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలం

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 4: నస్రుల్లాబాద్ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 12 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారులు ఇటీవల సీజ్ చేశారు. ఆ ఇసుకకు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో మంగళవారం వేలం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన మహేందర్‌గౌడ్ దానిని రూ.38,500కు దక్కించుకున్నాడు.

ట్రాక్టర్ బోల్తా : 8మందికి గాయాలు

భిక్కనూరు, ఫిబ్రవరి 4: ట్రాక్టర్ బోల్తాపడి ఎనిమిది మందికి గాయాలైన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచాపూర్‌లో ఓ వ్యక్తి మృతిచెందాడు. అతడి అంత్యక్రియల కోసం కట్టెలు తెచ్చేందుకు కొందరు ట్రాక్టర్ తీసుకొని పెద్ద మల్లారెడ్డికి బయల్దేరారు. తిరుగు ప్రయాణంలో బీరప్ప గుడి వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఉన్న ఎనిమిది మందికి గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కామారెడ్డి, ఫిబ్రవరి 4: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కామారెడ్డి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భూపుత్రమ్మ కల్యాణ మండపం సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పట్టణ ఎస్సై శ్రీరామ్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఓ వ్యక్తి మరో వ్యక్తికి ఒక కవర్‌ను ఇవ్వగా.. పోలీసులు వారిని పట్టుకున్నారు. కవర్‌ను గమనించగా.. అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి 380గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్, షేక్ అన్వర్‌గా గుర్తించారు. వీరు చోరీ, గొడవలు, ఇతర కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని దూల్‌పేట, ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి కామారెడ్డిలో విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చిన అనంతరం జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ తెలిపారు. మాదక ద్రవ్యాలు అమ్మితే డయల్ 100, టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా పట్టణ సీఐ 8712686145, పోలీసు స్టేషన్ 87126 66242 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

బిచ్కుంద, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి అచరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ,7,550 నిర్ణయించిందని, రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద, ఫిబ్రవరి 4: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పటుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి పెట్రోలింగ్ సమయంలో మండలంలోని ఖత్‌గావ్, హస్గుల్ గ్రామాల మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయాలి

లింగంపేట, ఫిబ్రవరి 4: హైదరాబాద్‌లో ఈనెల 7వ తేదీన నిర్వహించ తలపెట్టిన 'లక్షల డప్పులు.. వేల గొంతుకలు' సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నెల్లూరి గంగారాం కోరారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం గోడ ప్రతులు ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి మాదిగ జాతి సభ్యులు హాజరై తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మన్నె బాలయ్య, లెగ్గల రాజు, భూపతి, సంగమేశ్వర్, రాజు, పోచయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

రామారెడ్డి, ఫిబ్రవరి 4: 'లక్ష డప్పులు–వేల గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యదర్శి కొత్తొల్ల యాదగిరి పిలుపునిచ్చారు. కన్నాపూర్ గ్రామంలో మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

లింగంపేట, ఫిబ్రవరి 4: గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో సురేందర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మోతె గ్రామాన్ని మంగళవారం ప్రత్యేక అధికారి సందర్శించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, మిషన్ భగీరథ నీరు రాని రోజు గ్రామంలోని నీటి ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా చేయాలన్నారు. బోరుమోటర్లు మరమ్మతు చేసుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఆయనవెంట ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హారీ, ఏపీవో నరేందర్, గ్రామ కార్యదర్శి, ఉపాధిహామీ సాంకేతిక సహాయకులు తదితరులున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 4: ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలం కళ్యాణి, తిమ్మారెడ్డి ఊరుముందు తండా, వెల్లుట్ల, వెల్లుట్లపేట గ్రామాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్‌తో కలిసి తిరిగి పరిస్థితిని సమీక్షించారు ఎండాకాలంలో నీటి సమస్య వచ్చే సూచనలు ఉంటే ముందస్తుగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. వారితో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

తాగునీటి కోసం స్పెషల్‌డ్రైవ్..

రామారెడ్డి, ఫిబ్రవరి 4 : సదాశివనగర్ మండలం తిమ్మాజివాడి, తుక్కోజివాడి, వజ్జేపల్లి, దగ్గి తదితర గ్రామాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ చందర్ నాయక్, మిషన్ భగీరథ ఈఈ రమేశ్ మంగళవారం తాగునీటి కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. వారివెంట ఎంపీడీవో సంతోష్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..

• పారిశుద్ధ్యకార్మికుల గైర్హాజరీతో చెత్తతో నిండిన పట్టణ వీధులు • అందుబాటులో లేని అధికారులు

పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో చెత్తతో ఉన్న పట్టణ వీధులు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి4: ఎల్లారెడ్డి పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. మంగళవారం మున్సిపల్ కార్మికులు గైర్హాజరు కావడంతో వీధుల్లోని చెత్త అలాగే ఉండిపోయింది. పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలోని కిరాణా, ఫిష్, జ్యువెల్లరీ మార్కెట్లు, ప్రధాన రహదారిపై వ్యాపార సముదాయాలు, హోటళ్లు, బట్టలు, కిరాణా దుకాణాల ముందర సోమవారం నాటి చెత్తంతా అలాగే ఉండిపోయింది. మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న శ్రీహరిరాజు బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లడంతో నిజామాబాద్ నుంచి వచ్చిన మహేశ్‌కుమార్ మున్సిపల్ కమిషనర్‌గా గురువారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఆరు రోజులు గడిచినా ఆయన పట్టణంలో పూర్తిస్థాయిలో విధులకు సమయం కేటాయించకపోవడంతో పరిస్థితి అంతా అస్తవ్యస్తంగా మారింది. వీధులన్నీ చెత్తతో నిండగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేయగా, ఫోన్ కార్యాలయ సిబ్బంది వద్ద ఉండడంతో ఆయన మాట్లాడలేని పరిస్థితి ఎదురయ్యింది. ఇతర అధికారులకు ఫోన్ చేయగా సరైన స్పందన రాలేదు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు, కంపు తొలగించేందుకు ఏర్పాట్లు

చీనూర్ ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ వెనుక డ్రైనేజీలో జమాజిన్ పౌడర్ జల్లుతున్న సిబ్బంది, పరిశీలిస్తున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 4: మండలంలోని చీనూర్ ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం వెనుక భాగంలో నిలిచిన మురుగు, కంపు తొలగించేందుకు ఎంపీడీవో ప్రభాకర్ ఏర్పాట్లు చేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మంగళవారం 'మురుగు నిండింది.. కంపుకొడుతోంది' శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. దీనికి స్పందించిన కలెక్టర్ స్థానిక ఎంపీడీవో ప్రభాకర్‌కు 'నమస్తే తెలంగాణ' వార్త క్లిపింగ్‌ను పంపించి, వెంటనే వాటిని పరిశీలించాలని సూచించారు. ఎంపీడీవో ప్రభాకర్ సిబ్బందితో కలిసి వెళ్లి అంగన్‌వాడీ భవనం వెనుక డ్రైనేజీతో పాటు మురుగునిలిచిన కుంటలో జమాజిన్‌పౌడర్, ఆయిల్ బాల్స్ వేశారు. మురుగునీటిని చీనూర్ రోడ్డును తవ్వించి పైపులు వేసి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

మోడల్ హౌస్ నిర్మాణ పనుల పరిశీలన

మోడల్ హౌస్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 4: తాడ్వాయి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి (స్థానిక సంస్థలు) పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ గృహాల నమూనా గృహాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని పంచాయతీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీ సుకోవాలని సూచించారు. ఆయనవెంట తాడ్వాయి మండల ప్రత్యేక అధికారి రాజారాం, గృహనిర్మాణ శాఖ డీఈఈ ప్రభాకర్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ రహీమొద్దీన్, ఏఈ అశోక్ తదితరులు ఉన్నారు.

ఎంఈవోకు ఆత్మీయ వీడ్కోలు

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 4 : మండలంలో ఏడేండ్లు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించిన పిట్లం ఎంఈవో దేవీసింగ్‌ను ప్రస్తుత ఎంఈవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో సన్మానించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా దేవీసింగ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహాయ, సహకారాలు అందించిన ఉపాధ్యాయులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 4 : తాడ్వాయి మండలంలోని నందివాడ తండాకు చెందిన బర్మావత్ చందర్ (60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. చందర్ భార్య లక్ష్మి కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నందున కలత చెంది గత శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు, పరిస్థితి విషమంగా మారడంతో ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. అదే రోజు చందర్ భార్య లక్ష్మి మృతి చెందింది. చికిత్స పొందుతున్న చందర్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం దహనం

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 4: తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలో మాడి సత్యంకు చెందిన ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసినట్లు బాధితుడు తెలిపాడు. సోమవారం రాత్రి ఇంటి ఎదురుగా తన వాహనాన్ని పార్కింగ్ చేశానని, మంగళవారం ఉదయం లేచి చూడగా వాహనం కాలిపోయి ఉన్నదని వాపోయాడు. ఈ విషయమై పో